

# బాల వికాసం

నిజామాబాద్ జిల్లాలోని ఏర్గట్ల మండలంలో గల తడపాకల జడ్.పి.హెచ్.ఎస్. విద్యార్థులు రాసిన దాదాపు 150 కవితలతో "కవినాయక వినాయక" పుస్తకం త్వరలో ఆవిష్కరణ జరుగబోతోందని తెలుగు పండితులు దేశ్‌ముఖ్ ప్రవీణ్‌శర్మ తెలిపారు. ఈ పుస్తకంలోని మరిన్ని కవితలు ఈ వారం నేటినిజం పాఠకుల కోసం..



## మా పల్లె బతుకమ్మ

బతుకమ్మ పండుగ వచ్చింది –
అందరికి ఆనందాన్ని తెచ్చింది
బొడ్డెమ్మ చప్పట్లతో,
మంచి మంచి పాటలతో
అందరూ కలిసి ఆడుతాము బతుకమ్మ
బతుకమ్మ సంబురం,
అందరికి తెస్తుంది అంబురం
అది చూస్తే వస్తుంది మాకు ఎంతో ఆనందం
ఆడపడుచులు ఆడారు బతుకమ్మ
పతిఇంటికి ఉంటుంది ఒక అమ్మ
తీయటి సత్తిపిండి,
రంగురంగుల పూలతో,
పూలమాలలు అల్లి,
గునుగు, తంగేడుతో బతుకమ్మ తయారు చేస్తూ,
ముద్దబంతి పూలు,
చకచక మెరిసే చామంతులు
బతుకునిచ్చే బతుకమ్మ రంగురంగుల బతుకమ్మ
మా ఇంటి బతుకమ్మ, మా పల్లె బతకమ్మ

డి. స్నేహ
10 తరగతి

## బతుకమ్మ

అందరి మంచి కోరేది బతుకమ్మ
ఆడవాళ్లకు అంతులేని సంతోషం ఇచ్చేది
రంగురంగు పువ్వులతో అలంకరించి
అవన్ని రంగులు మన జీవితాల్లో ఉండాలి
తంగేడు పువ్వు పసుపు
గునుగు పువ్వు తెలుపు
తెలుపు రంగు శాంతికి చిహ్నం
ముద్దువచ్చే ముద్దబంతి
రంగుల పువ్వుల సమూహం
తొమ్మిది రోజుల చేస్తూ
తొమ్మిదో రోజు ఊరంత
ఆడవాళ్ల అలంకరణకు
బతకమ్మ రంగులకు విరసిల్లుతుంది
చెరువు అలల మీద తేలుతూ
చెరువుకు రంగుల హరివిల్లని ఇస్తుంది
ఆడవాళ్లంత సాంప్రదాయంగా ఉంటూ
బతుకమ్మలలో పెట్టుతారు
గౌరమ్మ స్త్రీల పసుపు కుంకుమలు
బతుకమ్మ ఆనందాల బతుకమ్మ.

-యం. జాహ్నవి
పదో తరగతి

## బతుకమ్మ

బతుకునిచ్చెడి తల్లి బతుకమ్మ
బాధ తీర్చేడి తల్లి బతుకమ్మ
ఎద నిండా ఆనందం ఇచ్చే తల్లి బతుకమ్మ
రకరకాల రంగురంగుల పువ్వులతో
పూల వనంలా పులకరిస్తూ ఉంటుంది
పల్లెంత పండుగ సంబురాలలో
మునిగి తేలుతారు
పొద్దున కోడికూతకు ముందే లేచి
అన్నదమ్ములంతా
గునుగు, గుమ్మడి పువ్వులు తెచ్చి
అక్కచెల్లెలంతా రంగురంగులతో
ఇంద్రదనస్సు వంటి
బతుకమ్మను పేర్చి, ఊరంతా ఊరేగిస్తూ,
ఆడపడచుల చప్పట్ల నడుమా
ఆటపాట, కోలాటాలతో
ప్రకృతినంతా ఆహ్లాదపరుస్తారు
సత్తిపిండి, సకినాలతో నోరూరిస్తూ
నవరోజుల బతుకమ్మను నవ్వంగా కొలుస్తారు
పట్టుచీర, పట్టుపంచలు కట్టి
ప్రకృతిని పండుగ వాతావరణంలో
ప్రకాశింపజేస్తూ, బతుకమ్మను కొలుస్తారు
వెళ్లిరావమ్మ బతుకమ్మ అని తోలుతారు

-ఎండీ. సమ్రీన్
10వ తరగతి

## బతుకమ్మ వచ్చేరా..

బతుకమ్మ వచ్చేరా..
ఆడపిల్లలకు సంతోషాన్ని ఇచ్చెరా..
పచ్చని చెట్లలో ఎగరేసిన బతుకమ్మ
బతుకమ్మ వచ్చినప్పుడు
ఆడపిల్లల ఇల్లు సందడే సందడి
తెలంగాణ పేరు అనగానే
ర్తుకు వచ్చేది ఒక బతుకమ్మ
ఆడపిల్లల కష్టాలను తొలగించే
ఓ బతుకమ్మ
మానవ సంస్కృతి,
సంప్రదాయాలతో మెరిసే
ఓ అందాల బతుకమ్మ
కమనీయమైన మా బతుకమ్మ,
కమ్మనైన మా బతుకమ్మ
దసరాకు చెస్తారు ఆనందం మగవాళ్లు
బతుకమ్మను చెస్తారు ఆనందంతో ఆడవాళ్లు
చప్పట్లు కొడుతూ..
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో అని పిలుస్తారు
తొమ్మిది రోజులు
తొమ్మిది పేర్లతో పిలిచే ఓ బతుకమ్మ
రంగురంగుల పూలతో మెరిసే ఓ బతుకమ్మ
తొమ్మిది రోజులు మాతోని ఉండి
నువ్వు వెళ్లిపోతున్నప్పుడు ఆనంద భాష్పాలతో
నిండుతున్న మా ఇళ్లు
బతుకమ్మ ఆడపిల్లలకు ఒక ఆయుధం,
బతుకమ్మ ఆడపిల్లలకు ఒక ఔషధం
వేల ఏండ్ల చరిత్ర ఉన్న మా బతుకమ్మ
దసరాకు ఒకటి, రెండు రోజుల ముందు
సద్దుల బతుకమ్మ
ఏరోజు ఎవ్వరిని మరిచిన
మా ఆడపిల్లలు బతుకమ్మను మరువలేరు.
అదే అదే మా బతుకమ్మ,
మా అందమైన బతుకమ్మ

-ఎం. పౌనిక
10వ తరగతి

## పూల బతుకమ్మ

గునుగు పూలతో చేసాము బతుకమ్మ
అది చేసింది మా అమ్మ
అందుకే బతుకమ్మ మన కన్న అమ్మ
బంతిపూలతో అలంకరణ చేసి
మట్టితో నిన్ను మేగి, అందమైన ముగ్గులు వేసి
అందంగా తయారు చేసి, అందరిని మెరిపించి
చాలా ఆనందంగా ఆడాము బతుకమ్మ
మంచి మంచి పాటలతో, అందమైన మాటలతో
ఆడాము బతుకమ్మ
పసుపుతో గౌరమ్మ చేసి,
ఆకు, పోక పెట్టి ఆడాము బతుకమ్మ
అందరూ ఒక చోట చేరి
నవ్వుల వర్షం కురిపించి, ఆడాము బతుకమ్మ
బతుకమ్మ వచ్చినప్పుడు చెట్లకు పువ్వులు నిండి
మా గుండెల్లో బతుకమ్మ నిండి
మా అందరిని హాయిగా ఉంచి
బతుకమ్మ పండుగా, ఆడవాళ్ల అండగా
ఆడవారికి బతుకమ్మ పండుగా,
తంగేడు పూలతో తల్లడిల్లే బతుకమ్మ
బంతి పూలతో భాగ్యంగా ఉండే బతుకమ్మ
చక్రం పూలతో చల్లగా ఉండే బతుకమ్మ
గులాబీ పూలతో గమ్యంగా ఉండే బతుకమ్మ
మందర పూలతో మిలమిల మెరిసే బతుకమ్మ
ఇలా ఉంటుంది బతుకమ్మ

-డి. రవీన
పదో తరగతి

## మార్గదర్శి

గురువు తన జీవితం
విద్యార్థులకు
భవిష్యత్తును అందించడానికే అంకితం
నిలుచుండి పాఠాలు చెప్పను నీవు
నీ విద్యార్థులకు ఎంతో
ఉన్నత స్థాయికి చేరిపించును
కానీ నీవు ఆ చోటనే నిలుచుండి పోవును
విద్యార్థి భవిష్యత్తుకు మార్గదర్శకం అవుతావు
పిల్లలను ఉత్తములను చేసి
నవ సమాజాన్ని నిర్మిస్తావు
దేశానికి ఎంతో మేలు చేస్తున్నావు,
నీ జీవితం ఒక పయనం
ఆ పయనంలో ఎందరికో ఇస్తావు జీవితాలు
నీవల్ల పిల్లల భవిష్యత్తు తిరుగుతుంది మలుపు
అదే నీకొక గొప్ప గెలుపు,
గురువు దేవుడితో సమానం
నీకుంటుంది గొప్ప సహనం,
అందుకే ఆచార్యదేవోభవా...

-సమీన
10వ తరగతి



## త్యాగమూర్తి

చిరునవ్వులాంటి గురువు
నాకు దేవుడు ఇచ్చిన వరం
అతీతమైనది స్వార్థం లేనివారు నా గురువు
మాకు నిరంతరం జ్ఞానబోధను చేసేవారు
అలాంటి గురువు
నేను ఎప్పటికీ మా గురువు ఇలాగే
ఉండాలని కోరుకుంటున్నాను
ఎప్పటికి మిమ్మల్ని మరచిపోలేను
మనల్ని మన కాళ్ల మీద నడిపించేవారు
గురువు
మనల్ని ఆనందంగా ఉంచేది గురువు
విద్యను భోదించి
మన భవిష్యత్తుని నిలబెట్టేవారు గురువు

-అంజలి
10 తరగతి

## గురు బ్రహ్మ

గురువు అంటే అందరికి చదువు చెప్పేవాడు
గురువు అంటే
మనకి తెలియని విషయాలు నేర్పేవాడు
మనకు ముందు గురువు మన అమ్మనాన్నలు
ఆ తరువాత బడిలో గురువు
మనన్ని బడిలో ఉంచుకొని
చదువుచెప్పే గురువుల కంటే
ఒడిలో ఉంచుకొని చదువు చెప్పే గురువులే మిన్న
ఎందుకంటే మన అమ్మనాన్నల కంటే
ఎక్కువ చదువుకున్నవారు
వారికి ఎక్కువ విషయాలు తెలుస్తాయి
ఆ విషయాలన్నింటిని
మనకు తెలియచేయటానికి కష్టపడతారు
కాని మనం ఆ విషయాలన్నింటిని విని గ్రహించాలి
పుస్తకంలో ఉన్న దాన్ని అర్థం చేసుకుని
గ్రహించడమే చదువు
వారు మనకి అన్ని మంచి విషయాలు చెబుతారు.
నాకు ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది.
ఎందుకంటే మా బడిలో కూడా చాలా చక్కగా
బోధించే గురువులు ఉన్నారు కాబట్టి

-సీహెచ్.కల్యాణ్
9వ తరగతి

## వెలుగు జ్యోతి

చిట్టి వేళ్లకు అక్షరం నేర్పి
చిన్నారులకు బంగారు బాట వేసేది
గురువు
అక్షరాలను చేత బట్టి రాయించారు
అజ్ఞాన బుర్రలో నుంచి విజ్ఞానాన్ని నేర్పేది
గురువు
క్రమశిక్షణ నేర్పే శిక్షకుడివి
విచక్షణ చెప్పే దిక్షకుడివి
మేధస్సుని పెంచేందుకు ఒక స్నేహితుల
తేజస్సుని పెంచుటకు ఒక గురువులా
విద్య నేర్పిన ఒక విశ్వ మిత్రుడిగా
వివేకం నేర్పిన సరస్వతీ పుత్రుడిగా
బొమ్మను చేసి పర బ్రహ్మకే ఆయుధం ఇచ్చిన
ఓ గురుబ్రహ్మవు నీవు
నీతిని నేర్పిన శాస్త్రానివి
జాతిని నడిపిన గురువు
ఒక ఆయుధం, ఒక బలం,
ఒక శక్తి అన్నీ గురువు

-ఎల్. లక్ష్మణ్
పదో తరగతి

## బంగారు బతుకమ్మ

బతుకమ్మ పేరు చెప్పగానే
గుర్తుకొచ్చేది ఆడపిల్లలు
మొదటి రోజున మొదలౌతుంది,
తొమ్మిది రోజులకు ముగుస్తుంది
మా బంగారు బతుకమ్మ,
మా ఆనందం మోసుకొస్తూ
పసిడి నవ్వులను చూసి మురిసి పోతుంది
మా బంగారు బతుకమ్మ
ఆడ పిల్లల పసినవ్వు బతుకమ్మ,
రాకరాక వచ్చింది మా ముద్దుల బతుకమ్మ
చెట్లకు ఆకులు ఎంత ముఖ్యమో,
మనిషికి మాట ఎంత ముఖ్యమో
ఇంటికి సందడి ఎంత ముఖ్యమో,
ఇంటికి బతుకమ్మ అంత ముఖ్యం
రంగు రంగుల బతుకమ్మ,
బంగారు బతుకమ్మ
తెలంగాణ పేరు చెప్పగానే
గుర్తుకొచ్చే పేరు బతుకమ్మ.

-ఎం. తిరుమల
10 తరగతి

## చిత్తుచిత్తుల బతుకమ్మ

బతుకమ్మ ఆడపిల్లలకు పువ్వుల కొమ్మ
చిత్తుచిత్తుల బొమ్మ అని పాట పాడుతారు
చప్పట్లు కొట్టుతూ, నీ చుట్టు తిరుగుతారు
గుండెనిండా నిండెను బతుకమ్మ సందడి
ప్రతి గల్లికి ఆరోజు అంగడి
తెలంగాణలో బతుకమ్మ ప్రాముఖ్యత
అదే మా రాష్ట్రానికి గొప్ప కథ
తొమ్మిది రోజులు ఆడవారికి పండుగ
నీవే మహిళలలకు అండగా,
చిరునవ్వులో నీవే, చిరు చినుకులో నీవే
చెట్లపై పూసే పువ్వు నువ్వే
చివరికి ఆడవారి గుండెల్లో
ఆనందాన్ని నింపేది నువ్వే
అందుకే ఆడవారికి అమ్మగా, అందరికి అండగా
ఉంటావు నీవు ఓ బతుకమ్మ
నిన్ను రకరకాల పువ్వులతో చేస్తారు ఆడవారు
నీ కోసం పుట్టింది గునుగు పువ్వు
ఆ పువ్వే నీ అందానికి తొలివలపు
బతుకమ్మ తెలంగాణకు ఓ అమ్మగా ఉంటుంది
అందుకే బతుకమ్మ పండుగను
తెలంగాణ ఆడపడుచులు
సంతోషంతో జరుపుకుంటారు
ఆనందంగా ఉంటారు.
ఈ బతుకమ్మ మా తెలంగాణకు
జీవం కలిగిన అమృత బొమ్మ
అందుకే మా తెలంగాణ
సస్యశ్యామలంగా మెరుస్తుంది
బతుకమ్మ పండుగా చిరుచినుకుగా మారి
నీటి బిందువుగా కురుస్తుంది

-ఎస్‌కే. సమీన
పదో తరగతి



## కోపం

కోపం ఒక శాపం
కోపం తెచ్చెను నష్టం
అది మనకెంతో కష్టం
కోపం మన లోపం
అని చెప్పుతుంది లోకం
అయినా మనం ఆపం

మనిషికి వచ్చెను కోపం
అది తగ్గకుంటే పాపం
మనిషికి తగ్గెను కోపం
అతనికి వచ్చెను లాభం
లాభం తెచ్చెను శుభం
శుభం చేకూర్చెను సర్వం.



- అల్లాడి శ్రీష్మ
10వ తరగతి
శ్రీ చైతన్య టెక్నో స్కూల్, సిద్దిపేట

# కలవరపెడుతున్న క్యాన్సర్ కబళిస్తోంది.



ప్రపంచం వ్యాప్తంగా అనేకమంది వయసు ప్రాంతంలాంటి బేదాలు లేకుండా క్యాన్సర్ వ్యాధి బారినపడుతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతమని భేదం లేకుండా పలువురికి క్యాన్సర్ వ్యాధి సోకుతోంది. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకూ చాలామంది ఈ వ్యాధి బారిన ఏటా 70 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రభుత్వ సంస్థలు, ఎన్జీవోలు, స్వచ్ఛంద సంస్థలు వ్యాధి లక్షణాలపై ప్రచారం చేసి, వ్యాధికి గురైనవారికి సరైన చర్యల ద్వారా వ్యాధి నివారణ సాధ్యమన్నది చెప్పాలన్న లక్ష్యంతో ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ నివారణ కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, సదస్సులు, లెక్చర్లు నిర్వహించడం ద్వారా ప్రజల్లో చైతన్యం అంతర్జాతీయ క్యాన్సర్ నివారణ సంస్థ సూచనలను, ప్రచార కార్యక్రమాలను, పాంప్లెట్లను ప్రజలకు అందించడం ద్వారా ప్రచార కార్యక్రమాలు దేశ వ్యాప్తంగా చేస్తున్నాయి. ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ (జఎఅఅ)చే స్థాపించబడ్డ రోజు ఫిబ్రవరి 4న ప్రతి సంవత్సరం క్యాన్సర్ వ్యాధికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోంది. .ఈ క్యాన్సర్ వ్యాది గురించి ప్రతీఒక్కరికి అవగాహన కల్పించి చికిత్సను ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ఉద్దేశ్యం. ప్రతి సంవత్సరము ఒక థీమ్ ను తీసుకుని ప్రచారం కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ ఏడాది 'అయామ్ అండ్ ఐ విల్' అనే నినాదముతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మన శరీరంలో కణ విభజన అనేది నిరంతరం జరిగే ప్రక్రియ. అయితే ఇది అన్ని భాగాలలో జరగదు మన శరీరంలో కన్ను మెదడు గుండె మూత్రపిండాలు వంటి ప్రత్యేక క్రియల కోసం ఏర్పడ్డ అవయవాలు పుట్టినప్పుడు ఏ విధంగా ఉంటాయో జీవితాంతం కూడా అదే విధంగా ఉంటాయి. వీటి లో కణ విభజన జరగదు. అయితే వయసుతో పాటు వీటిని సంఖ్య తగ్గుతుంది కానీ పెరగదు. మరికొన్ని కణాలు అవసరాన్ని బట్టి పుడుతూ చనిపోతూ ఉంటాయి . ఎర్రరక్త కణాలు తెల్ల రక్త కణాలు నిరంతరం విభజన చెందుతూనే ఉంటాయి వాటి జీవిత కాలం అయిపోగానే అవి చనిపోయి వాటి స్థానంలో కొత్త కణాలు వచ్చి చేరుతూ ఉంటాయి. కొన్ని సార్లు కణంలో జన్యువులలో వచ్చే మార్పుల వల్ల ఒకటి లేక కొన్ని పనికిరాని కణాలు ఒక పద్ధతి ప్రకారం కాకుండా నిరంతరం విభజన చెందుతూ ఆరోగ్యకరమైన కణాలను నాశనం చేస్తూ వాటి అవాసాలను ఆక్రమిస్తూ చుట్టూ ఉన్న కణాలను మొత్తం ఆక్రమిస్తాయి. వీటికి మరణం లేకుండా నిరంతరం విభజన చెందుతూనే ఉంటాయి ఆ ప్రాంతంలో గడ్డలు ఏర్పడుతూ ఉంటాయి. అన్నీ గడ్డలు (వ్రనాలు) క్యాన్సర్ గడ్డలు కావు నొప్పిని కలిగి ఉన్న గడ్డలు క్యాన్సర్ కలిగిస్తాయి. ఫలితంగా చుట్టుపక్కల ఉన్న కణాలు వాటి విధులు నిర్వర్తించక జీవక్రియలు తగ్గిపోయి క్రమంగా మనిషి మరణానికి దగ్గరవుతాడు

క్యాన్సర్ కణాలు ఒక భాగంలో పుట్టి అక్కడే ఉ ండవచ్చు లేదా రక్తనాళాల ద్వారా ఒక చోటి నుంచి మరో చోటికి వ్యాపించి మిగతా కణాలను నాశనం చేస్తాయి అనువంశికంగా వచ్చే జన్యువులు 10 శాతం కాన్సర్ లకు కారణం అయితే మిగిలిన 90 శాతానికి మన జీవన శైలే కారణం. ఆహారపు అలవాట్లతో పాటు వాతావరణ కాలుష్యానికి అతినీలలోహిత కిరణాలకు హానికర రసాయనాలు విషపదార్థాల, వైరస్ ప్లాస్టిక్ వాడకం, రేడియేషన్ బారిన పడి క్యాన్సర్‌కు గురి అవుతున్నాము.

కేన్సర్‌కు కారణాలలో ఆధునిక జీవన శైలి ప్రధానమైంది. చుట్ట, బీడీ సిగరెట్, పొగతాగడం, గుట్కా, తంబాకు టోబాకో నమలడం, స్థూలకాయం, అధిక బరువు, పండ్లు తక్కువగా తీసుకునేవారు, కూరగాయలు తీసుకొననివారు, శారీర శ్రమ తక్కువగా చేసేవారు, మద్యం సేవించేవారు, అనారక్షితమైన శృంగారం కారణంగా, హెచ్.ఐ.వి ఇన్ఫెక్షన్ సోకినవారు, పట్టణ ప్రాంతాల్లో కాలుష్యం బారినపడినవారు, పొగ వాసన ఎక్కువగా భరించేవారు, అనువంశికంగా ఎక్కువ సమస్యలు ఎదుర్కొనేవారు, సూర్యరశ్మిని నేరుగా ఎదుర్కొనేవారు ప్రమాదం బారినపడే అవకాశం ఉంది. సాధారణంగా శరీరంలోని అన్ని భాగాలకు క్యాన్సర్ వస్తుంది కొన్ని క్యాన్సర్ల నివారణకు మనం తినే ఆహార పదార్థాలు సమర్థంగా పనిచేస్తాయి. క్యాన్సర్‌ను సులభంగా నిరోధిస్తాయి. క్యాన్సర్‌లలో ప్రోస్టేట్ క్యాన్సర్, బోన్ క్యాన్సర్, బ్రెయిన్ క్యాన్స,ర్ పెదవులు, నోరు వంటి భాగాలకు వచ్చే క్యాన్సర్, మూత్రాశయ క్యాన్సర్, తల మెద క్యాన్సర్, పెద్దపేగు మలద్వార క్యాన్సర్. గాలిబ్లాడర్ క్యాన్సర్, జీర్ణాశయ క్యాన్సర్, మూత్రపిండాల క్యాన్సర్, కాలేయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, ఒవేరియన్ క్యాన్సర్, కంటి క్యాన్సర్ ఇలా శరీరంలో ఎక్కడైనా ఏ బాగానికైనా రావచ్చు.

శరీరంలో ఏదైనా అవయవానికి కేన్సర్ సోకితే తొలిదశలో లక్షణాలు అంతగా కనిపించవు. వ్యాధి సోకిన అవయవాన్ని బట్టి దీని నిర్ధారణ పరీక్షలు కూడా వేర్వేరుగా ఉంటాయి. కొన్ని రకాల క్యాన్సర్లనూ ఒకే విధమైన పరీక్షతో తెలుసుకోవడం సాధ్యం కాదు. క్యాన్సర్ అంటువ్యాధికాదు. అలాగే వంశపారంపర్యంగా వచ్చే అవకాశం కూడా తక్కువే. అయితే, రొమ్ము, థైరాయిడ్, పెద్దపేగు, పాంక్రియాస్ క్యాన్సర్లు జన్యుపరంగా సంక్రమిస్తాయి. కుటుంబంలో ఎవరికైనా ఈ కేన్సర్లు వస్తే వచ్చే ప్రమాదం ఉంది. క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించకపోతే ఇతర భాగాలకూ వ్యాపించి, చికిత్సకు సైతం ఏమాత్రం తగ్గు ముఖం పట్టవు. కాబట్టి దీనిపై అవగాహనతో ఎదుర్కొవాలి. క్యాన్సర్ సోకినవారిని సమాజానికి దూరంగా ఉ

> సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకూ చాలామంది ఈ వ్యాధి బారిన ఏటా 70 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు.

ంచకుండా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేలా కార్యక్రమాలు రూపొందించాలి..

క్యాన్సర్ కణం శరీరంలో ఎక్కడుందనే విషయం తెలుసుకోవడం కష్టం. ఏ అవయవానికి సోకిందనే అనుమానం ఉంటే దానికి సంబంధించిన పరీక్షలు వేర్వేరుగా ఉంటాయి. వీటిలో బయాప్సీ, యఫ్‌యన్‌ఏ టెస్ట్, బ్లడ్ మార్కర్స్, ఎక్స్-రే, సీటీ స్కాన్, యంఆర్ఐ, పీఈటీ స్కాన్ వంటివి అవసరాన్ని బట్టి పరీక్ష చేస్తారు. అయితే సర్వైకల్ క్యాన్సర్‌ను పాప్‌స్మియర్ ద్వారా ముందుగా గుర్తించవచ్చు.

అందరితో సమానమన్న భావన కూడా కలిగించడం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం యొక్క ప్రధాన ఉద్దేశం. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులపై ఎవరూ జాలి చూపించాల్సిన అవసరం లేదన్నది ఇక్కడ ముఖ్యమైన విషయం. క్యాన్సర్ వ్యాధి సోకినవారు జీవితంలో ఏదైనా సాధించగలరన్న అభిప్రాయాన్ని కలిగించేందుకు విజయవంతమైన జీవితా లను వారికి వివరించాలి. క్యాన్సర్ వ్యాధి బారినపడు తున్నవారు, వ్యాధితో చనిపోతున్న వారు ఎక్కువగా అభివృద్ధి చెందని ప్రాంతాల్లోనే ఉన్నారు. ఈ పరిస్థితిని అదుపు చేయలేకపోతే వచ్చే 2030 నాటికి మృతుల సంఖ్య విపరీతంగా పెరిగే ప్రమాదం ఉంది.

(ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా..)



-నెరుపటి ఆనంద్


# అలరించిన చిందు యక్షగాన ప్రదర్శన




చిందు కళాకారుడు పిల్లిట్ల సంజీవయ్యను సత్కరిస్తున్న డా॥ నందిని సిధారెడ్డి, సాధనా నరసింహాచార్యులు, కళా రామచంద్రమూర్తి, బైస దేవదాసు, కళా జనార్ధనమూర్తి, డా॥ ఏ విజయకుమార్, వై. రాజేంద్రప్రసాద్.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥కేవీ. రమణాచారి జన్మదినం సందర్భంగా త్యాగరాయ గానసభ నిర్వహిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సప్తాహం ప్రారంభ కార్యక్రమం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్యాంశంగా ప్రసిద్ధ తెలంగాణ జానపద కళాకారుడు పిల్లిట్ల సంజీవయ్య బృందం చిందు యక్షగాన సంప్రదాయంతో కీచక వదను ప్రేక్షకరంజకంగా ప్రదర్శించారు. సంజీవయ్యతో పాటుగా సహ కళాకారులు ముత్తులింగం, కనకయ్య, శ్యామ్‌సుందర్, శ్రీశైలం, మురళి, భుజంగం, హైమవతి, అలివేలు ప్రదర్శనలో పాల్గొన్నారు. ముఖ్య అతిథి రాష్ట్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు డా॥నందిని సిధారెడ్డి ప్రధాన కళాకారుడు పిల్లిట్ల సంజీవయ్యను సత్కరించి బృందం సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా సిధారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావానంతరం ముఖ్యమంత్రి ఆదేశంతో ఇక్కడి కళాకారులకు బాగా ప్రోత్సాహం లభిస్తుందన్నారు. త్యాగరాయ గానసభ అధ్యక్షులు కళా జనార్ధనమూర్తి సభాధ్యక్షత వహించారు. అతిథులుగా లయన్ డా॥ఎ. విజయ్‌కుమార్, వై. రాజేంద్రప్రసాద్, బైన దేవదాసు, కళారామచంద్రమూర్తి హాజరయ్యారు. సాధన సాహితీ స్రవంతి అధ్యక్షుడు నరసింహాచార్య ఆహ్వానం పలికారు. ఆధ్యాత్మిక రచయిత పురాణపండ శ్రీనివాస్ రచించిన "శ్రీ పూర్ణిమ' గ్రంథ ప్రతులను అతిథులకు బహూకరించారు.

పంట పండినా
కళ్లలో తడి...
కారకుడెవరు?
దళారే మరి!




ఇదండీ!
శిథిల వర్తమానం
స్నేహానికి
స్వార్థమే కొలమానం



దేహభాషే
మనసు బాధ తెలియదు
నలిగి నలిగీ
మల్లెలు వాడాయి

అసత్యానికి
తరగని విలువ
సత్యానికైతే
నిలువెత్తు శిలువ



ప్రయాణమిప్పుడు
గాలిలో దీపం
అన్నింటికీ సాక్షి
'రోడ్డు' పాపం!




తల్లికి, బడికి
దూరంగా
అయ్యో! బండరాళ్లమధ్య
భావిభారతం

'మేరా భారత్ మహాన్'
అంటున్నారు
అవినీతి ముసుగులో
దర్జాగా తింటున్నారు




సలుపుతున్న
మానని గాయాలు
సామాన్యునికిక
దుఃఖగేయాలు



పెళ్లంటే
నూరేళ్లపంట
అంతలోనే చీడపట్టింది
ఎందుకంట?

సమతా మమతా
సమసమాజం
అన్నీ... ఇక
ఓ కన్నీటి స్వప్నం




ఎర్రకణాలు
తెల్లకణాలు
విధ్వంసకణాలెక్కడివి
మనిషి రక్తంలో



అతడు కూడా
వైద్యుడే...
చెమటతో
చెప్పులను అతికించాడు

డా॥ఎన్. గోపి
సృష్టించిన 'నానీ' ప్రక్రియలో
వందలాది నానీ సంకలనాలు
వెలువడ్డాయి. గుంటూరు
వాస్తవ్యుడు ఎం.ఎస్. సుభాని
ఇటీవల వెలువరించిన
"సామాజిక నానీలు"
పుస్తకంలోని కొన్ని నానీలు
చిత్రాలతో..






కేర్‌సెంటర్‌లో
పసితనం
ఆ చూపుకి...
చెప్పగలవా భాష్యం!



నలుగురి భుజాలపై
రారాజులా...
కల నిజమైంది
శవమయ్యాక!



పాలబుగ్గల మీద
కన్నీటిచారికలు
బండచాకిరీతో
బాల్యం పీలికలు

ఆకాశానికి
వాగ్దానాల నిచ్చెన
కాళ్లకిందేమో
ప్రకంపనం

చీకటిగనుల్లో
జీవనగమనం
లోకానికి
వెలుగుకోసం




పూసేపూలపై
వేటకొడవళ్లు
ప్రేమోన్మాద
పైశాచికదాడులు

దహనకాండలో
శవాలు రెండు
మనిషీ...
మరొకటి చెట్టు



దేహాలపై
వేరే నగలెందుకు
చెమట బిందువుల
ముత్యాలుండగ!




ఏకత్వమంటే
సరిహద్దుల్లోనే
దేశరక్షణ దీక్ష
గొప్ప సందేశం

ఉరిమిన మేఘం
కురవనంది
కరవుకాటుకి
రైతుకంట నీరు




అరచేతిలో
అన్నీ ఇముడ్చుకున్నా
గుప్పెడంత మనసు మాయలో
మనిషి




నారుపోసింది,
నీరుపోసిందీ మనమే
పెరిగింది మాత్రం
నల్ల'ధనం'!

తరతరాలుగా
అడవిపుత్రుడు
భూమిపై హక్కు మాత్రం
హుళక్కి



మనిషి-మరణం
మధ్య రణం
తుది విజయం
మరణానిదే




ఏలికలు
ఎవరైతేనేమి
చెట్టుకు వేలాడే
రైతన్నను చూడరేమి!

ఎంగిలివిస్తర్ల వద్ద
కుక్కల్తో సహవాసం
అయ్యో!
ఇదా మనదేశం



పేదరికానికి
తలొంచిన పేగుబంధం
అమ్మకానికి
కడుపుపంట




యుద్ధం...
గెలిచినా ఓడినా
పుడమితల్లికి తప్పదు
పుత్రశోకం

లంకంత కొంపలో
ఒంటరి
సెల్‌ఫోన్, బొచ్చుకుక్క
తోడు... నీడా...!




పట్టపగలు
కమ్మినచీకటి
అస్తమించిన
హక్కుల 'బాల'భానుడు




ఇల్లు ఇరుకైతేనేం
ప్రేమామృతం
పంచుతుంది
ఇంటి ఇల్లాలు

అంతటా
ఆసుపత్రులే
పేదరికంపై పోరులో
మృత్యువే గెలిచింది



గుప్పెడు గింజల కోసం
ఎదురుచూపు
కాంక్రీటు వనమై
పొలం వెక్కిరింత




అతడో శిల
అనుబంధాలను
నిబంధనాల్లో
బందీచేస్తాడు



కటికనేలపై
కష్టాలనిద్ర
బక్కదేహంపై
చిరుగుల దుప్పటి

ఇక... అన్నీ ఉచితమే
ముందుముందు
పనిచేసేవారుండరేమో
లోకమందు



గోతులూ
చిమ్మచీకటి
మురుగుకంపు
'పుర'వైభవం చూడు...!

మొదలంటా
నరికిన చెట్టు
మబ్బుకంట్లో
నీటికి బదులు నెత్తురు!



కరన్సీదే
మహామాయంటే
దగ్గరచేస్తుంది!
దగ్ధమూ చేస్తుంది...




తుళ్లింతలతో
గెంతులేసే బాల్యం
ఇప్పుడు
గోడకు కొట్టిన బంతి

బెల్లంచుట్టూ ఈగలు
శవం చుట్టూ
రాబందులు
కర్త కర్మ క్రియ... కరెన్సీ



కవిగా
చిరంజీవి
అభినందనల
అమృతం తాగాడేమో!



'పన్నీ'రో
'కళం'కమో
రాజకీయ చదరంగంలో
ఎత్తుకు పైఎత్తులు




# సాహిత్యాంధకారంపై ఎలుగెత్తిన గళం "కొత్త కోణం"

సాహితీ లోకంలో జరుగుతున్న అనేక సమస్యల్ని గమనించిన నిర్ధిష్టమైన కవి బిక్కికృష్ణ. తెలుగు సాహిత్యంలో దాదాపు అనేక ప్రక్రియల్ని ఆపోసన పట్టిన కవి. కవిత్వం, గజల్స్, పాటలు, కథలు, విమర్శ వంటి ప్రక్రియల్లో తమదైన ముద్రను చాటుకున్నారు. వీరి భావజాలం అంతా ప్రశ్నించే రీతిలో సాగుతుంది. ఎక్కడా కవిత్వం కనిపించదని ఆవేదన చెందుతారు. మంచి కవిత్వానికి సరైన చోటు లేదని వాపోతారు. అవార్డులు, రివార్డులు ఇవేవీ కవిగా నిలబెట్టడానికి సరిపోవని నిర్ధారిస్తారు. ఎందుకంటే వీరు అక్షరం విలువను తెలిసినవారు. ఏది కవిత్వమో, ఏది కాదో అనేది ఖచ్చితంగా తెలుపగల సమర్ధులు. వీటికి తోడు తాను గొప్ప కవినని తముకు తావే తెలియజేసుకుంటారు. తాను చాలా గొప్పవాడినని, తాను మనసున్న వాడినని, సాహిత్యానికి తాము చేస్తున్న సేవ సామాన్యమైనది కాదని కూడా గొంతెత్తి అందరికీ తెలుపుకుంటారు. మనం రచనలో సత్తువుంటే ఎవరైనా అలాగే చెప్పుకోవాలని, తాము చేసే పనులు గొప్పవైనప్పుడు పదిమందికీ తెలుపుకోవాలని కూడా అంటారు. ఇలాంటి వ్యక్తిత్వాలు చాలా అరుదుగా మనకు కనిపిస్తాయి. తమపై తామకున్న నమ్మకాన్ని గమనించిన అనేకమంది పెద్దలు అందరూ ఔననే సమాధానం ఇస్తారు. వీరికి సాహితీ సంస్థల మీద, సంఘాల మీద, వర్గాల మీద, కవిత్వమే కనిపించని కవిత్వం మీద విపరీతమైన ఆగ్రహం కనిపిస్తుంది. సాహిత్యాన్ని అమ్ముకుంటున్నారు కదా అని కోప్పడుతుంటారు. అనర్హులు అందరూ అందలాలను ఎక్కుతుంటే అర్హత కలిగిన వారు ఏమయిపోవాలి అనే ఆవేదనను కనబరుస్తారు. రచయితల అవగాహనా రాహిత్యం మీద, అధ్యయన శూన్యత మీద, విరుచుకు పడుతుంటారు. రాజకీయాలు ఏర్పడి రచయితలలో, కవుల్లో నిబద్దత పోతోంది అనే బాధను వ్యక్తీకరించే తీరులో నిబద్ధతను కనబరుస్తారు.

నిజమే.. అక్షరం కనుమరుగవుతోంది.. అన్యాయం ఎలుగెత్తి పాడుతోంది. ఈ విషయం సాహితీలోకంలో అందరూ ఒప్పుకుంటారు. కానీ ఏంచేస్తాం? అన్ని దారులూ అవే అయితే ఆ దారినే పోవడమే. తప్పదు. మనిషి జీవితంలో మాటకు గానీ, అక్షరానికి గానీ ఎంతో విలువుంది. మాట మనసుని అంచనా వేస్తుంది. అక్షరం ఆయుధమై తరతరాలను దిశానిర్ధేశం చేస్తుంది. ఒకప్పుడు మహా కవులు సైతం తమకు ఇచ్చిన బిరుదులను తమ పేరు ముందు ఉంచుకోవడానికి ఇష్టపడేవారు కాదు. కారణం వారి అక్షరాలు, భావాలు శిలాక్షరాలై జనం గుండెల్లో నాటుకుపోయాయి. గుండెకు మించిన శిలాఫలకం ఏముంటుంది? ఇప్పుడు వంద గ్రంథాలు వెలువడినా అందులో విషయాలుంటాయి తప్ప కవిత్వం కనిపించదు. అయితే మనకో వెసులుబాటు ఉంది ఏమి రాసినా కవిగా పిలవబడచ్చు. ఏది రాసినా రచయితగా చలామణి కావచ్చు. ఒక్క కవిత్వ రాస్తే చాలు మరసటి రోజు సన్మానం చేసే సంస్థలు ఉన్నాయి. ఒకే ఒక్క గ్రంథం రాస్తే చాలు యూనివర్సిటీలు సైతం పిలిచి సన్మానించే అవకాశాలున్నాయి. కవిత్వంలో ఏమాత్రం సత్తువ లేకున్నా మహాకవి అనే మహాకవులు అంటూ గ్రూపులు నడిపే కాలంలో ఉన్నాం. కీర్తికోసమే రచించేవారు ఎక్కువైనపుడు, లేని కీర్తిని కిరీటంలా తొడిగి వ్యాపారం చేసుకునేవారు ఎక్కువైనప్పుడు జరిగే అనర్థాలే ఇవి. రాసేవారికంటే ఆ రచనను మోసేవారుంటేనే నేడు రచన నిలబడుతోంది. ఒకే కులమైనప్పుడు, ఒకే మతమైనప్పుడు, ఒకే వర్గమైనప్పుడు, ఇలాంటివి సాధ్యపడుతుంటాయి. తెలుగువారు గొప్పవారు అని వేదికలపైనే అంటుంటారు. అదే వేదికపై తెలుగేతరులకే పట్టం కడుతుంటారు. స్త్రీలకు సమానత్వం ఇవ్వకపోతే ఎలా వాపోతుంటారు. పదిమంది ఉన్న వేదికపై ఒక స్త్రీకి కూడా అవకాశం ఇవ్వకుండా సమావేశాలు జరుపుకుంటారు. అందుకే అనిపిస్తుంది అనేక సార్లు. ఆడవారికి ఆడవారే శత్రువులైనట్లు తెలుగువారికి తెలుగువారే శత్రువులు అని. వీటన్నింటినీ ఎండగట్టడానికీ, నిలదీసి ప్రశ్నించడానికీ ఏమాత్రం బిక్కికృష్ణ గారు ఏమాత్రం వెనుకాడలేదు. తెలుగు సాహిత్యంలో కనిపించే ఈ అస్పష్టతపై తమ వ్యాసాల ద్వారా విరుచుకు పడ్డారు. మహా నగరాలలో ఉండే చేటు ఇదే. ఇంకా నయం ఒక్కోసారి జిల్లాల్లో జరిగే కవిసమ్మేళనాలు, అందరినీ కలుపుకునే తత్త్వాలు చూస్తుంటే చాలా సంతోషం కలుగుతుంది అంటారు. కవులు ప్రలోభాలకు లొంగిపోకూడదని, కవిత్వం రాస్తూ శీలవంతులుగా ఉండాలని, తోటి కవులను చూసి అసూయ పడకూడదని, లౌక్యం ముసుగులో దాక్కోకూడదని, రచయితలు ఒకరిపై ఒకరు ఒక స్థాయికి వస్తే బురద జల్లి బతకకూడదని, వాస్తవం లేని నిందలు వేయకూడదని, అవార్డుల కోసం ఇచ్చేవారి ఎదుట బాకాలు ఊదకూడదని, కాకాలు పట్టకూడదని అనడమే వీరి వ్యాసాల ఆంతర్యం.

అలా తమకు ఎదురైన వికారాలను, వివరాలను, వింతలను, విపరీత తత్త్వాలను వెదికి విముఖత చెంది వీరు అనేక వ్యాసాల ద్వారా తమ ఆగ్రహాన్ని చూపారు. సాహిత్యం అనేది గొప్ప కళ. ఆ కళావేదిక నేడు ఎన్నో అవలక్షణాలతో కనిపిస్తుంటే ఎదురొడ్డి ఆపాలని ప్రయత్నిస్తున్నారు. కాకుంటే దురదృష్టం ఏమిటంటే నేడు సాహిత్యం ఒకచోట ఆగిపోయింది. అది ఆగిపోయిందా? లేక ఆపేసారా? అనేది వేరే విషయం. 2000 దశకం నుంచి కవులే లేరన్నట్లు మాట్లాడుతున్నారు. మరి ఈ రాస్తున్న కవులెవరు? ఇన్ని వందల కవిత్వాలు రచించిన వారు కవులు కారా? మరెందుకు వందలకు వందలు మందల్లా



పిలిచి కవిసమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు? వారందరికీ శాలువాలు కప్పేసి, బిరుదులు ఇచ్చేసి పల్లకీలు మోస్తున్నట్లు? తీసుకున్న శాలువాలు, బిరుదుల్ని వాడేసుకుంటూ తామేదో శ్రీకృష్ణదేవరాయల నాటి కవులమని చెప్పుకుని తిరిగే ఈ కుకవుల మధ్య అసలైన కవులకు తావేది? అనే ఆవేదనా లేకపోలేదు. వేలకు వేలమంది దేశాలు కాని దేశాలలో, ప్రాంతం కాని ప్రాంతంలో కవిత్వం చదివితే తప్ప కవులు కారా? చెత్త కబుర్లు మోసుకుంటూ, లేని విషయాలను నీచంగా వక్రీకరిస్తూ ప్రయాణం చేస్తే తప్ప ప్రయాణం కాదా? సోకాల్డ్ కవులు ఆలోచించాలి.

అయితే.. ఇవన్నీ ఎవరికి తెలియవు? తలపండిన మహాకవులనుంచి ఇపుడే కలం పట్టిన వారి వరకు ఈ విషయంలో ఒక విధమైన అవగాహన ఉంది. అయితే ఎవరికి వచ్చిన రీతిలో ఈ అన్యాయాల్ని ఎలుగెత్తి చాటుతున్నారే తప్ప పదిమందికి జరుగుతున్న విషయాన్ని ఎత్తి చూపడానికి సాహసించడం లేదు. ఎదుటి వారికి వస్తే అన్యాయమని, తమకు వస్తే న్యాయం జరిగిందని చెప్పుకునే సమాజంలో మనం ఉన్నాం. కనిపిస్తే మీ అంతటి వారు లేరని, వెనక్కు తిరిగి వీడంత చెత్త కవి లేరని చెప్పుకునే నీచ సాహితీలోకంలో మనం జీవించేస్తున్నాం. కవి గుండె ఆర్ధ్రతతో నిండిపోయి వుంటుందట.

చూస్తుంటే ఆర్తి తప్ప ఆర్ధ్రత మచ్చుకైనా కనిపించదు. అందుకేనేమో సాహిత్యంలో రాజకీయాలు అవసరమా? విమర్శలో అహం అవసరమా? అంటూ ఎలుగెత్తి చాటుతున్నారు.

కవి బిక్కికృష్ణ గారు అక్కడితో ఆగలేదు. ఇవే కాకుండా ఏఏ కవులు గొప్పవారు? ఏ కవి వస్తువు ఎంపికలో న్యాయం చూపారు? జ్ఞానపీఠ్ అవార్డు స్త్రీలకు ఎందుకు రావడం లేదు? ఏ ఏ కవులకు ఎంత అన్యాయం జరిగింది? ఏ కవి, కవయిత్రి శైలి ఎంత గొప్పగా ఉంటుంది? ఏ కవులు సాహితీ లోకానికి అర్హులు? అని తమకు మంచి కవులుగా తోచిన మహిళల కవిత్వాల్ని కూడా ఈ వ్యాసాల్లో పొందుపరిచారు. ఎంతోమంది కవులుగా అనర్హులు అయినా మహాకవుల వెనుక కాకులై తిరుగుతూ బతికేస్తున్నారు వంటి అనేక విషయాలను ఏకరువు పెట్టిన పదునైన వ్యాససంపుటి ఇది. నిజాన్ని నిర్భయంగా నిలదీసిన ఈ వ్యాసాలు ఈ కవి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనాలు. ఒకవైపు నిబద్ధతను, మరోవైపు నీతిని మరచిన కవులతో నిండిపోయిన ఈ సాహితీలోకం ఎప్పటికైనా గొప్ప సృజనకారుల్లా మారుతారేమో అనే చిన్ని ఆలోచనే బిక్కి కృష్ణ ఎదురుచూపు.. మారాలనే ముందుచూపు.. అంతే..!

ప్రతులకు : బిక్కి చందన
ఫోన్: 99127 38815

-శైలజామిత్ర
9290900879

## నేటినిజం చందా వివరాలు

ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపుకుని **5** సం॥రాలకు రూ.**700/-**, **10** సం॥రాలకు రూ **1200/-** మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

'నేటినిజం' దినపత్రిక, ఎస్ఆర్టి-74,
జవహర్‌నగర్,
హైదరాబాద్-500 020.

## పెకిలిన కలం గళం

అక్షరాభ్యాసంతో ఆరంభమై
అంతిమ ఘడియల దాకా
విజ్ఞానవికాస సిరా ఊట బాయి
అంగి జేబుకే అంగమైన కలం !
పలుకే బంగారమైన పెన్ను
విస్ఫోటనమై మేల్కొలుపు
కళ్లేలేని కమణీయ కలం
సమస్తాన్ని చూపగల నేర్పరి !
మూగతానైననేమి..
నా కలమే గళమైంది
జీవమే లేని పాళీ..
అక్షరశిల్పానికి ప్రాణం పోసే ఉలి !
కలం తడబడిన ఘడియ
తిరోగమన తికమకలే
పెన్ను అడుగులు ఆగితే
అక్షర జననం ప్రశ్నార్ధకం !
పెకిలిన పెన్నులోంచి..
ఆలోచనామృతం ప్రవహించు
అజ్ఞానాంధకారాల్ని హరిస్తూ
కీర్తి కిరీటమై నన్ను దీవించు !
నన్ను నాకు పరిచయం చేసిన నేస్తం
నన్ను నడిపించే సారథి
దూరాల్ని కలిపే వారధి
నా విలువను పోషించే పెన్నిధి !
కలం గళమెత్తిన నాడు..
అవినీతి గుండెల్లో గునపం
అక్రమజ్వాలల అగ్నిమాపకం
ప్రతినాయకులకే చలి జ్వరం !
పాళీ పారాలంటే..
జరగాలి మేథోమథనం
మదిమర్మాలు తేటతెల్లం
పదునెక్కాలి కరవాలమై కలం !
కలం బహుముఖ ప్రజ్ఞాశాలే కదా
యువావేశాగ్నికి ఆజ్యం పోస్తూనే
లోక రుగ్మతల జ్వాలలపై నీళ్లు చల్లగల
సర్వరోగ నివారణకు దివ్య ఔషధం !



-డా-బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## మాతృదేవోభవ

నవమాసాలు కడుపులో మోసి
పునర్జన్మ పొంది జన్మనిస్తుంది
కన్న కడుపు తీపితో చీదరించుకోక
మలమూత్రాదులు కడుగుతుంది
ఏడ్చినంత లోనే చనుపాలు నిచ్చి
ఆకలి మంటలు ఆర్పుతుంది
కౌగిటి పంజరమ్మున బంధించి
నా బంగారు కొండ అంటూ
తీయ తీయని మాటలు ఎన్నో
ఆప్యాయతగా పలుకుతుంది
చిలుక పలుకులు ఎన్నో చెప్పి
తీయని పలుకులు నేర్పుతుంది
బుడిబుడి నడకలు నేర్పి
అంబరానికి తాకేలా సంబర పడుతుంది
ఉయ్యాలలో ఊపి నిద్ర పుచ్చుతుంది
లాలి పాటలు పాడి మైకం తెప్పిస్తుంది
కన్నతల్లిని వర్ణించ తరము కాదు
ఎన్ని జన్మలకైనా రుణం తీర్చుకోలేము
మాతృ దేవో భవా
అందుకో నా వందనాలు




-జాధవ్ పుండలిక్ రావు
9441333315



# అర్ధవంతంగా సాగిన "రామకృష్ణ శతకం"

పుస్తక సమీక్షలు





ఆంధ్ర వాఙ్మయమున శాఖోపశాఖలుగా వికాసము నొందిన కావ్య ప్రక్రియలలో శతకమొకటి. ప్రాకృత, సంస్కృత ప్రక్రియల ననుసరించియే తెలుగు శతక రచన ప్రారంభమై కాల క్రమంలో ఒక విశిష్ట ప్రక్రియగా రూపుదిద్దుకుంది. తెలుగులో పన్నెండో శతాబ్ధిలో శతకం ఆవిర్భవించింది. ఆ తర్వాత తెలుగు శతకం విస్తరిల్లి స్వరూపంలోనూ, స్వభావంలోనూ ఎంతో మార్పులను తీసుకొచ్చింది. భారతీయ భాషల్లో ఎందులోనూ శతక ప్రక్రియ తెలుగు భాషలో లాగా వైశిష్ట్యాన్ని పొందలేదు. నేటికీ ఏ మూలనో ఒక చోట శతకం ఇలా వెలువడుతూనే ఉంది. సజీవ స్రవంతిలా అవిచ్ఛిన్నంగా సాగుతోంది కూడా. శతకానికి సంఖ్యానియమం, మకుటం,వృత్త నియమం, ముక్తక లక్షణం, ఆత్మానుభూతి ఉండాల్సిందే. ఆంధ్ర శతక సాహిత్యాన్ని రచనా విధానాన్ని బట్టి, వస్తువును వర్గీకరించవచ్చు. గేయ, అన్యాపదేశ, అదిక్షేప, శ్లేష, అనుప్రాస శతకాల వర్గీకరణ రచనా విధానాన్ని బట్టి చేయబడింది. వస్తువును బట్టి భక్తి శతకం. నీతి, శృంగారం, వైరాగ్యం, హాస్యం, దేశభక్తిర రాజకీయం అనే విధాలుగా విభజించుకుని తెలుగులోని శతకాలను పరిశోధకులు రసరమ్యంగా వివరించారు కూడా. ఇపుడు కవయిత్రి అంబుజ అందించిన రామకృష్ణ శతకం ఎంతో అర్ధవంతంగా సాగింది. అయితే ఈ రామకృష్ణ ఎవరు? రామకృష్ణ పరమహంసా? అనుకున్నా కానీ కాదు. తన భర్త రామకృష్ణారెడ్డి గారి పేరుతో రచించిన ఈ శతకం ఎంతో మార్గదర్శకంగా ఉంది.

"నీతి పనులు జేయ ఖ్యాతిని దెచ్చును/ నీతిలేని జాతి విలువలేదు/ నీతి మంతుడగుచు జ్యోతిగా వెలగాలి/ రామకృష్ణ మాట ప్రగతి బాట" అంటారు. మంచి మాటలను వివరిస్తూ రచించిన శతకం కనుక ఇది నీతి శతకమే అని అనవచ్చు. "మంచితనము పంచి మానవత్వము తోడ/ మంచి చెడులు తెలిసి మసులవలెను/మంచి మార్గమెపుడు మన్నన పెంచును/ రామకృష్ణ మాట"

"అమ్మ జోలపాడి అలకనే తీర్చును/నాన్న వేలు పట్టి నడత నేర్పు/అమ్మ నాన్నలనిన అవనిలో దేవుళ్ళు/ రామకృష్ణమాట" అని మంచి విషయాలను తెలిపే రీతిలో తెలిపిన తీరులో ఎంతో హృద్యంగా ఉంది. సామాజిక వాస్తవికతను, ఆధునికతను, ఆటవెలదులలో పొదిగి సాహితీలోకానికి అందించారు. ఈ శతకంలో బంధాలు, నడవడిక, స్నేహమాధుర్యం, రైతు బాధ, మాతృభాష, ఓటుహక్కు వంటి అంశాలపై అద్భుతమైన పద్యాలు రచించారు. కవయిత్రి అంబుజ రచన ఎంతో బావుంది.

"చిలుకలవలె / పలకు చిన్న పిల్లలెపుడు/ ముద్దుగొలుపు చంద్రుముత్యముఖములయు/ చెదరిపోవు బాధ చిన్నారులను చూడ" అనే శతకంలోని భావం ఎంతో హాయిగా ఉంది. "నవ్వుమోము నందు నడయాడుచుండగా/ మనసు బరువు దిగును మమతపెరుగు/ అందమైన నవ్వు ఆరోగ్యమును పెంచు" అనే శతకం కవయిత్రి పరిశీలనకు దర్పనంగా చెప్పవచ్చు.. "కత్తిపట్టబోకు కలమును చేపట్టు/ కత్తి దెచ్చు మార్పు క్షణికమౌను/ కలముదెచ్చు మార్పు కలకాలముండును" అనే శతకం నేటి సమాజానికి ఎంతో ఉపయుక్తముగా సాగింది. నిస్సందేహంగా కవయిత్రికి స్వాగతం..

ప్రతులకు: టి. అంబుజ
ఫోన్: 94937 10142

-శైలజామిత్ర







# అపురూపమైన "నీతి పుష్పాలు"

"నీతి పుష్పం" అనే పేరులోనే ఉంది కవిత్వం. నీతిని తెలిపేది ఖచ్చితంగా పుష్పమే. చెట్లు, ప్రకృతి, పువ్వులు, ఆకులు, గాలి, నీరు అన్నీ నీతికి పర్యాయపదాలే. అలాంటి నీతిని బాలలకు గేయరూపంలో అందించాలనే ఆలోచన వచ్చిందంటేనే ఈ కవి వరుకోలు లక్ష్మయ్య ప్రయత్నంలోనూ నీతి ఉన్నట్లే. ఇందుకు సందేహం లేదు.

మనిషి జీవితంలో మరచిపోలేని దశ బాల్యం. ఎందుకంటే అరమరికలు లేని ఆ సమయంలో తప్పులుండవు. అమాయకత్వంతో మాట్లాడిన మాటలు, తెలియక చేసే చిన్న తప్పిదాలు తప్ప మరేదీ ఉండదనేది అందరికీ తెలుసు. కనిపించిన ప్రతి ఒక్కరూ తమకు సంబంధించిన వారే అనుకుంటారు. ప్రతి ఒక్కరిలో మంచిని మాత్రమే చూస్తారు. ప్రతి ఒక్కరికీ మేలు చేయాలనే ఆలోచిస్తారు. అలాంటి బాల్యానికి ఏమిచ్చినా తక్కువే. కానీ దురదృష్టం ఏమిటంటే ఇప్పుడు బాల్యం తప్పిపోయింది. బాల్యదశ అంతరించిపోయింది. అందుకే గడచిపోయిన బాల్యాన్ని గుర్తుచేసుకోవడానికి, ఎక్కడా కనిపించని బాల్యాన్ని వెదకడానికి ఇలాంటి ప్రయత్నాలు అవసరం. పద్యాలు పాడుకుంటూ, సంస్కారవంతమైన పదాల్ని వల్లెవేసుకుంటూ ఉండే బాల్యం కనుమరుగైన కారణంగానేమో ఇప్పుడు చాలా మంది బాలసాహిత్యంపై మక్కువ చూపుతున్నారు. వరుకోలు లక్ష్మయ్య ఇదివరలోనే "మబ్బుల పల్లకి" అనే పిల్లల కోసం బాలగేయాలు రచించారు. 64 గేయాలున్న ఈ సంపుటిలో సమకాలీన సమస్యలన్నీ ఉన్నాయి. పర్యావరణ సంరక్షణ, విద్య, ఆత్మీయ బంధాలు, పండ్లు గొప్పదనం, పువ్వుల అందం, ప్రకృతి అవసరం లాంటివి ఎన్నో ఉన్నాయి. తీయనైన తెలుగు భాషను చక్కనైన భాషతో పదిలంగా కాపాడుకోవాలనే తపన ఉంది.

**"రంగు రంగు బొమ్మలున్న పుస్తకాలు చదువుకో / అంతరంగమందు నీవు ఆలోచన పెంచుకో"**

**"తల్లి భాష నేర్చుకుంటూ/ పరభాషలు నేర్చుకో"**

**"వానంటే వానరా/ కుండపోత వానరా/ రైతు చేను పండగా/ రాజ్యము వర్ధిల్లెరా"**

**"గోవుల వలన మనకెన్నో/ లాభాలున్నాయి సోదరా/ పాలనిచ్చి తల్లిలాగను/ కాపాడేది గోవురా"**

**"క్రమశిక్షణయే తప్పిన వ్యక్తిని/ తాడు తెగిన గాలిపటమందురురా"**

**"స్వార్ధ బుద్దిని వీడాలి/ దేశ సేవకై నిలువాలి/ కలామ్ బాటలో నడవాలి/కల్పవృక్షమై వెలుగాలి"**

వంటి అనేక అర్థవంతమైన, అవసరమైన గేయాలను వీరు రచించారు. కానీ, నేడు పెరుగుతున్న సాంఘిక మాధ్యమాల పుణ్యాన ఈ గేయాలకు, పాటలకు పని వుండటం లేదు. పసిపిల్లలు సైతం తీరిక సమయాల్లో ఆటలు మానేసి మొబైల్ ఫోన్ల మోజులో పడటం మనం నిత్యం గమనిస్తున్నాము. కానీ ఈలాంటి కవులు కేవలం రచించడమే కాకుండా ఈ గేయాలను దగ్గరున్న బడుల్లో విద్యార్థులకు అందించాలి అని కోరుకుంటూ వీరి ప్రయత్నానికి అభినందిస్తున్నాను.

ప్రతులకు: వరుకోలు లక్ష్మయ్య
గ్రా॥ గట్లమల్యాల, మం॥ నంగునూర్,
జిలా॥ సిద్దిపేట- 502 280 (తెలంగాణ జి॥)
సెల్: 9704865816

-శైలజామిత్ర

## తోలుబొమ్మలు

తోలుబొమ్మ లాటలు
బ్రతుకునేర్పు బాటలు
కళ్ళకు కట్టినట్లు తెలిపే
గడిచిన చరిత్రల ఆటలు !!

కళ్లుండి చూడలేవు
చెవులుండి వినలేవు
కదులుతూనే సందేశమిస్తాయి
నోరుండి మాట్లాడలేవు !!

చరిత్రలు తెలుసుకోవాలన్న
జీవన స్థితిగతులు నేర్వాలన్న
తోలుబొమ్మలాటలు చూడాలి
మంచిని ఆస్వాదించాలన్న !!

ఆడించేవాడు ఆటకుడు
పాడించేవాడు పాటకుడు
తోలుబొమ్మలాటలు చూసి
నేర్చుకొనువాడు ప్రేక్షకుడు !!

న్యాయదేవత ఒకబొమ్మ
అన్యాయాన్ని చూడని అమ్మ
నయవంచకుల నడ్డివిరుస్తది
ఆమెది స్థిరంగుండె జన్మ !!

మనిషి ప్రాణమున్నజీవి
స్థిరమైనదికాదు అతనిజీవి
బొమ్మలా జనహితంకోసం బతికితే
అప్పుడతడు ఐతడు ధన్యజీవి !!




-తాంద్ర చిరంజీవి
9959180762.

# శ్రీరామ శతకము...

పుస్తక సమీక్షలు





వరంగల్లు శ్రీలేఖ సాహితివారు శ్రీమాన్ తిరుకోవలూరు రామానుజ స్వామి వారి శతజయంతి ఉత్సవాల సందర్భంగా "శ్రీరామ శతకము" పేరుతో 1984లో వెలువడిన గ్రంథాన్ని పునర్ముద్రణ చేసి మనకు అందిస్తున్నారు.

శ్రీలేఖ సాహితి 1984లో మొట్ట మొదట ప్రచురించిన గ్రంథం ఇదే కావడం విశేషం. దాదాపు 125 గ్రంథాలను వెలవరించి ఎంతో మంది వర్తమాన, ప్రవర్ధమాన కవులను ప్రోత్సహించిన ఘనత గల శ్రీలేఖ సాహితి వారు శ్రీమాన్ తిరుకోవలూరు రామానుజ స్వామి వారి కలం నుండి జాలువారిన 'శ్రీ రామ శతకాన్ని' మళ్లీ ముద్రించి పాఠక లోకానికి సమర్పించడం సంతోష దాయకం!

భారత, భాగవత, రామాయణాలు, విశిష్టాద్వైత సాంప్రదాయ గ్రంథాలపై పట్టున్న వారి నాన్నగారి నుండి రామానుజస్వామి వారు అమరకోశం, ఆంధ్రనామ సంగ్రహం, జ్యోతిష, వాస్తు సంగ్రహం, సంగీతం వంటి కళలను ఒంట పట్టించుకున్నారు. పదిహేనవ ఏటనే పంచ సంస్కారములు విశేషార్థాలు, సూక్తి ముక్తావళీ, శ్రీవచన భాషణం, తిరుప్పావై వంటి అంశాలను వారి నాన్నగారి ద్వారా నేర్చుకున్న రామానుజ స్వామి వారు పాత కరీంనగర్ జిల్లా పర్లపల్లి గ్రామానికి చెందినవారు. 1919లో జన్మించిన ఆయన 2008లో పరమపదించారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయులుగా పని చేసే కాలంలోనే రచనా వ్యాసంగంపై ముఖ్యంగా శ్రీ సీతారాముల వారిపై భక్తి ప్రపత్తులను ప్రదర్శిస్తూ 'శ్రీరామ శతకము'ను రాసి అందరి మన్ననలు పొందారు. తమ జీవితాన్ని ధన్యం చేసుకున్నారు.

ఈ కావ్యం పునర్ముద్రణకు నోచుకోవడానికి.. సౌజన్య దాతలుగా భాగవతోత్తములు, నిత్య కైంకర్యపరులు డా॥ సి.హెచ్. హనుమంతరావు దంపతులు ముందుకు రావడం ముదావహం.

ద్వితీయ ముద్రణకు కూడా శ్రీ లేఖ సాహితి వారు 35 సం॥ల తర్వాత పూనుకోవడం సంతోషించదగింది. ఇప్పుడు తిరుక్కోవలూరు రామానుజస్వామి వారు మన మధ్య లేకున్నప్పటికీ.. 2019 వారి శత జయంతి సం॥ కనుక వారు రాసిన ఇతర రచనలను కూడా ఈ పుస్తకంలో పొందుపరిచి మరింత శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఇందుకోసం విశేష కృషి చేసిన శ్రీలేఖ సాహితి అధ్యక్షులు డా॥ టి. శ్రీరంగస్వామిగారు అభినందనీయులు.

శ్రీమాన్ రామానుజస్వామి వారి హృదయాంతరాల్లో నుంచి వెలువడిన ఇందలి ఆలోచనలు నిజంగా అన్నీ అమృత వచనాలే! శ్రీరామ చంద్రులవారే వారి చేత రాయించినట్లుగా భావించే విధంగా ఈ శతకంలో పద్య రచన కొనసాగింది.

శతక ఆరంభంలో డా॥ చెన్నమనేని హన్మంతరావు గారు మరియు ఆచార్య పెరంబుదూరు లక్ష్మణ మూర్తిగారు రాసిన ముందు మాటలు పుస్తకానికి నిండుదనాన్ని కూర్చాయి,

శ్రీమాన్ రామానుజస్వామి వారు 'అందుకొనవయ్య శ్రీరామ వందనములు' అను మకుటంతో పద్యాలను రాసిన శ్రీరాముల వారికే అంకితమిచ్చారు. ఇందలి రచనను సీస పద్యాలలో కొనసాగిస్తూ.. శ్రీ వైష్ణవ సంప్రదాయం పట్ల శ్రద్ధాభక్తులు ప్రకటించడం విశేషం! లోక కళ్యాణం కాంక్షించి.. తమ ఆర్తి, భక్తిని జోడించి.. భగవత్కటాక్షం కోసం.. ముఖ్యంగా శ్రీరామ చంద్రులవారి కృప కోసం.. రామానుజ స్వామివారు ఎంతో నిష్ఠతో రాసిన శతకమిది!

ఇందలి పద్యాల్లో రామానుజ స్వామి వారి ఆధ్యాత్మిక భక్తి భావం, అడుగడుగునా కానవస్తుంది.

శ్రీరామ చంద్రుల వారిని వినమ్రంగా అభ్యర్థిస్తూ రాసిన పద్యం అందరినీ ఇట్టే ఆకట్టుకుంటుంది.

శ్రీరాములు వారి ఆర్త రక్షణాది గుణాలను స్తుతిస్తూ. స్మరిస్తూ, ప్రస్తావిస్తూ హృద్యంగా రాసిన పద్యంలో

**సీ॥ నేనెంత వేడినా నీ కేల దయరాదు**
**భక్తవత్సల దీన భయ విదూర**
**నేనెంత బిలిచినా నీవేల పలకవు**
**కరిరాజు వెతదీర్చు కమల నాభ**
**నేనెంత తలచినా నీవేల కానరావు**
**గోపికా ప్రియదర్శ గోపబాల**
**నేనెందు జూచినా నీ జాడ కనరాదు**
**ప్రహ్లాదు గాచిన పరమ పురుష**

**తే॥ కుబ్జ వెతలను దీర్చిన కూర్మిసఖుడ**
**చింతయంత్యను గోపిక చింతదీర్చు**
**నాథ నన్నిదె రక్షించు నళిన నేత్ర**
**అందుకొనవయ్యా శ్రీరామ వందనములు"** అంటూ వేడుకున్నారు. ఈ శతకంలో "ఆర్తి వేడుకోలు" శీర్షికతో మరిన్ని పద్యాలను పొందుపరిచారు.

**ఉ॥ నాయను వారలంచు మరి నమ్మితి గ్రుడ్డిగ నొక్కరైన ఆ**
**ప్యాయత తోడ నా కనుల బాష్పకణమ్ములనద్ది నాదిగుల్**
**బాయగ నొక్కరైన ప్రియవాక్యము బల్కగలేరు బాపు బా**
**ధయసి ధార భద్రగిరిరామ రఘోత్తమ శ్రీ మనోహరా!**

అంటూ ఆర్తిగా వేడుకున్నారు. ఉత్పలమాలలో సాగిన ఈ పద్యాలు.. రామానుజస్వామి వారి పాండిత్య ప్రతిభకు అద్దం పట్టే విధంగా కొలువుదీరాయి!

'మాతృస్మృతి" శీర్షికతో ఉత్పల మాలలో పొందుపరచబడిన పద్యాల్లో.. తమ మాతృమూర్తి లక్ష్మమ్మగారి పట్ల గౌరవాన్ని చాటుకున్నారు.

ఇంకా ఈ పుస్తకంలో పైవాటితో పాటు భజయతి రాజ స్తోత్రంధాటి పంచకంలోని కొన్ని శ్లోకాలను తాత్పర్య సహితంగా పొందుపరిచారు. అంతేగాక.. ముదళ్వారులు సాయించిన (పాశుర) పద్యములకు అనుసృజనను కందంలో అందంగా ఆవిష్కరించారు.

ఇలా శ్రీమాన్ తిరుకోవలూరు రామానుజస్వామి వారి శ్రీరామ శతకంతో పాటు.. వారి ఇతర రచనలను ఈ పుస్తకంలో నిక్షిప్తం చేశారు.

నాగుల యుగంధర్‌గారు వేసిన ముఖచిత్రం పుస్తకానికి శోభను కూర్చింది.

ప్రతులకు:శ్రీలేఖ సాహితి
ఇ.నెం. 27-14-53,
మండల ఆఫీసు ఎదురుగా
హసనపర్తి, వరంగల్-506 371, తెలంగాణ
వెల: 50/-, పేజీలు: 96
సెల్: 9949857955

-దాస్యం సేనాధిపతి
94405 25544

## మెరుపులు

మనిషి మనుగడకు
అవసరం మని
మనసు నిలకడగా
వుండాలంటే అవసరం పని

మాట మంచి గుంటే
అది మానవత్వం
మనిషివున్న సంగతి
మరిస్తే రాక్షసత్వం

పలుకులో వుండాలి
సరళత
చేసే పనిలో వుండాలి
స్పష్టత

సాయపడే మనసే
సాధనలోనే చూద్దాం
మనిషి తత్త్వం
దైవత్వం

మనిషి అభివృద్ధికి
కావాలి పరివర్తన
అప్పుడే విజయం
ఎగిసిపడు ఉవ్వెత్తున

పిల్లలకి చెపుతాము
మంచి మంచి కథలు
పురోభి వృద్ధికై తెలుసుకోవాలి
పెద్దవారి వ్యధలు


ఎవరికీ ఎవరు
కారాదు భారం
తెలిసి తెలిసి
చేయకూడదు నేరం

స్నేహం ఉండాలి
కలకాలం మంచిగా
కృషి చేస్తే
విజయం నిదేగా


పెద్దవారి పట్ల
ఉండాలి గురుతర భాద్యత
పేదవారికి సాయమందిస్తేనే
మానవత్వానికి యోగ్యత

ఎప్పుడూ పురోభివృద్ధి వైపే
నీ పయనం
అప్పుడు కన్నీరు
కార్చదు నీనయనం

పుస్తకాలతో చేద్దాం
ఎప్పుడూ దోస్తీ
మస్తకానికి చేయదు
అపుడు సుస్తీ



- కె. శైలజా శ్రీనివాస్
8019736254



చైనా మహాకవి జీదిమాజా కవిత్వం 'The Enduring one' నకు 'కాల విజేత' పేరిట డా. ఎన్. గోపి చేసిన తెలుగు అనువాద గ్రంథాన్ని జనవరి 24 న హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ (HLF)లో ప్రముఖ సాహితీవేత్త హర్షవర్ధన్ ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత్రి ఓల్గా, ప్రముఖ రచయిత అక్కినేని కుటుంబరావు, ప్రచురణకర్త కిరణ్‌ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



జనవరి 26 రిపబ్లిక్ డే రోజున విశాఖపట్టణంలోని స్థానిక ఐ.మ్.ఏ హాలునందు డైమండ్ జూబ్లి సందర్భంగా 1961 బేచ్ మెడికల్ స్టూడెంట్స్ (ఇపుడు రిటైర్డ్ డాక్టర్స్) సమక్షంలో నెల్లూరు తొలి నవలా రచయిత్రి అయిన డా॥ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డిగారి 30వ పుస్తకం 'శివాని' నవలను డా॥ గోవర్ధన్ ఆవిష్కరించారు.

## "నాన్న"

నీ అక్షరాలు రెండే, నీలోని ఉద్వేగాలు బోలెడు....
నీ భుజాలకెక్కించి ప్రపంచాన్ని చూపావు....
భాద్యతల బరువు మోసి....
ఇప్పుడు ఆ భుజాలు వంగిపోయాయి.....
ఈ లోకపు వింత పోకడల నడుమ
నీ కడవరకు నా కూడా ఉండేది నువ్వొక్కడివే......
నాపై కనిపించే ఆరాటం అమ్మది ఐతే,
కనిపించని పోరాటం నీదే కదా.....
నాతో ప్రపంచం చేసే యుద్ధంలో
అనునిత్యం సిద్ధంగా ఉండే నువ్వు నాకు సైనికుడివే.....
కష్టం అనే కడలిలో కుటుంబం అనే పడవను
ఇష్టంగా నడిపే నువ్వు నాకు నావికుడివే....
నీ అడుగుజాడల్లో నడిచే అమ్మకు, నీ వేలు పట్టి నడిచే
నాకు...ఇరువురికి నువ్వు గురువువే....
తొలిపొద్దు కిరణం తో బయలుదేరి....మలిసందె వేళ ఇల్లు చేరే
నువ్వు మా ఇంటి సూర్యుడివే....
అమ్మ సృష్టికి రూపం అయితే.....ఆ దేవునికి ప్రతిరూపం నువ్వు
మా ఇంటి ఇలవేల్పువే....
నాన్న,
నా నేస్తం, సమస్తం....నువ్వే,
నా సైన్యం, సమూహం....నువ్వే,
నాకు అండవై ఉండిపో ఎప్పటికీ....




– జాబేర్.పాషా
0096897663604


# నాటి శ్రామిక జనజీవన చిత్రణ

జగ్గని యిద్దె, సంఘము జంట నవలల రచయిత లోకమలహరి (1910–2010). సామాన్య కుటుంబము నుంచి వచ్చినవాడు. ప్రభుత్వాధికారిగా, ఉపాధ్యాయుడిగా పనిచేసిన వాడు. స్వయంకృషి, పట్టుదలతో పైకి వచ్చిన వాడు. తన కుటుంబ పరిస్థితులకు అనుగుణంగా, పొలం దున్నటం, కల్లుగీత, నేతపని లాంటి వైవిధ్యమయిన పనులలో అనుభవం గడించిన తత్త్వవేత్త. శతాధిక గ్రంథకర్త. ఈయన రాసిన కొద్ది రచనలలో ఈ సంకలనం ఒకటి.

సంకలనంలోని మొదటి నవల జగ్గనియిద్దె. జగ్గడు ఒక వ్యవసాయ కూలీ ఇంట జన్మిస్తాడు. చదువు మీద ఎంతో ఆసక్తి కనబర్చేవాడు. తండ్రి యిరన్న జగ్గని ఆసక్తి గమనించి, తన తలకు మించిన భారం అయినా జగ్గడిని చదువులో వేస్తాడు. జగ్గని చరుకుదనం శ్రద్ధ పట్టుదల గమనించి పురుషోత్తం అను ఉపాధ్యాయుడు జగ్గడిని అన్ని విధాలా ఆదుకుంటాడు. చివరకు







జగ్గడు ఎం.ఎల్.ఎల్.బి.చదివి జగ్గారావుగా మారుతాడు. వసంత అనే అనుకూలవతిని పెళ్ళాడి నిరీక్షరాస్యతా నిర్మూలనపై కంకణం కట్టుకుని స్వగ్రామం చేరుతాడు.


రెండవ నవల "సంఘం" ఆనాటి నేతగాండ్ల కడగళ్ళను వివరిస్తుంది. నర్సయ్య అనే పద్మశాలి ఆ ఊరి పెద్ద ఆగ్రహానికి 'ఎర' అవుతాడు. కొడుకు తిరునాళ్లలో తప్పిపోతాడు. ఇల్లు కొట్టం అగ్నికి ఆహుత వుతుంది బ్రతకటానికి బొంబాయి (ముంబాయి) వెళ్తాడు బార్య అతికష్టం మీద కాలాన్ని వెళ్లబుచ్చుతూ ఉంటుంది. రజాకారుల కంటే దుర్మార్గంగా ఆ వూరి వెలమ దొరలు బలహీనుల్ని పీడిస్తూ ఉంటారు. మిల్లు గుడ్డలకిచ్చే ప్రోత్సాహము వలన నేతగాళ్ళకు దినము గడుచుటే కష్టంగా ఉంటుంది. అందరూ కలిసి 'సంఘం' పెట్టుకుని సంఘటితంగా తమపై జరిగే దుర్మార్గాలను ఎదురుకోవ టానికై నడుం కడుతారు.

స్వాతంత్ర్యం రాక ముందు తెలంగాణా ప్రాంతపు బడుగుజనం కష్టాలను, ఊరి పెద్దల ఆకృత్యాలను, సంఘపు కట్టుబాట్లను ఆనాటి చదువులు వర్ణ వ్యవస్థలాంటి విషయాల మీద గొప్ప అవగాహన కలిగించే సంకలనమిది.

ఆనాడు గ్రామీణుల నోట పలుకబడే భాష– గోజల్ని గానుట (పశువుల కాయటం) కట్టానికి, బయపడ్తాట్లా (కష్టానికి భయపడుతరా) యిసిత్రం జెప్పవడ్తిరి (విచిత్రం చెప్ప నడితివి) జాతీయాలు "పందికొక్కు తనకిందికే తోడి కొన్నట్లు" "యిద్దెతోనే బుద్ధిగ్యానం" అందరి కండ్లల్లుండకు, కులానికి దుర్నామం (చెడ్డపేరు) వచ్చేపని లాంటి పదాలెన్నో.

ఆనాటి బాష, యాసని, మరుగునపడ్డ మలహరి లాంటి మాణిక్యాలని వెలుగులోకి తెచ్చిన తెలంగాణ సాహిత్య అకాడమీ ఎంతగానో అభినందపాత్రము.

ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమీ కళాభారతి, రవీంద్రబారతి ప్రాంగణము, హైదరాబాద్–500 004.
ఫోన్: 040–29703142



– కూర చిదంబరం
సెల్: 8639338675

## రాజు

వాడు–
చీకటిలోనే నడుస్తాడు
చీకటి పనులే చేస్తాడు ?
చీకటిలా వ్యాపిస్తాడు
చీకటి అంటే వాడే !
వాణ్ణి సంహరించే సూర్యుడు
వచ్చిపోతుంటాడు ?
అప్పుడు
ఆ కాస్సేపూ దాక్కుని
మళ్ళీ వాడే ఆక్రమిస్తాడు !
సమస్తాన్నీ సంపాదిస్తాడు
వాడి రహస్యాలు
ఎవ్వరికీ
తెలియవనుకుంటాడు !
వాణ్ణి శాశ్వతంగా మట్టుబెట్టేవాడు
ఎక్కడా లేడనుకుంటాడు–
వాణ్ణి పుట్టకుండా చేసే శక్తి
లోకంలో నిజంగానే
ఎవ్వరికీ లేదు !
వాణ్ణిచూసి
అందరూ పారిపోతారు ?
వెలుగును వెతుక్కుంటూ పోతారు
కానీ
వాడి అంశలన్నీ
అన్నిలోకాల్లోనూ
వ్యాపించి
అప్రతిహతంగా
పురోగమిస్తున్నాయి–
కనుక ఎప్పటికీ
లోకానికి వాడే రాజు !!



–డా॥చింతలపాటి మురళీ కృష్ణ
–ఆస్ట్రేలియా.
+61 431 368

పుస్తక సమీక్ష

# బాల్యంపై పూసిన చిరుమొగ్గలు

తెలుగు సాహిత్యంలో అనేకనేక ప్రక్రియలు నిరంతరం వస్తున్నాయి. అలాంటి నూతన ప్రక్రియలో కాలానికి నిలబడే ప్రక్రియలు కొన్నైతే కాలగర్భంలో కలిసిపోయేవి అనేకం. కాలానికి నిలబడే కవిత్వం, ప్రక్రియల్లో ఆధునిక జీవితానికి సంబంధించిన అంశాలను ఎన్నుకొని, ఆ ప్రక్రియలో నూతనత్వం, కవితాశిల్పం, అభివ్యక్తి, ఆకర్షించే నైపుణ్యం కలిగి ఉంటే అది కాలానికి నిలబడుతుంది. అలాంటి కాలానికి నిలబడే ప్రక్రియగా మొగ్గలు ప్రక్రియను చెప్పుకోవచ్చు. ఈ మధ్యకాలంలో అనేక ప్రక్రియలు వచ్చినప్పటికీ మొగ్గలు తెలుగు సాహితీ సిగలో నక్షత్రాలా పుష్పిస్తున్నాయనడానికి చాలా సంతోషిస్తున్నాను.

"మొగ్గలు" ముచ్చటగా మూడు పాదాలతోనే అర్థవంతంగా సృజనాత్మకంగా, భావయుక్తంగా చక్కగా ఆవిష్కరించవచ్చు. మూడు పాదాలలోని మొదటి రెండు పాదాలు ఒక అంశాన్ని అర్థవంతంగా ఆవిష్కరిస్తే, మూడో పాదం వాటికి సమర్థింపు పాదంగా అభివ్యక్తమవుతుంది. మూడవపాదమే మొగ్గలకు ప్రాణం. ఈ మూడవపాదం ఒక సామెతగా సూక్తిగా, జాతీయంగా, నినాదంగా ఏదైనా రాయవచ్చు.

2017 సెప్టెంబర్ మాసంలో ప్రముఖ యువకవి, పాలమూరు సాహితి అధ్యక్షులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ మస్తిష్కంలో బీజం పడిన మొగ్గలు , రెండు సంవత్సరాల కాలంలోనే అనేక సంపుటాలు రావడం జరిగింది. మొగ్గలు సృష్టికర్త భీంపల్లి శ్రీకాంత్ మొదట "మొగ్గలు,బతుకమ్మ మొగ్గలు" కవితాసంపుటాలు, ఆ తర్వాత ఉప్పరి తిరుమలేష్ "చిరు మొగ్గలు,బతుకమ్మ మొగ్గలు", బోల యాదయ్య "మట్టి మొగ్గలు", అనుపటి హేమలత "తొలి మొగ్గలు" వెలువడ్డాయి. మొగ్గలు ప్రక్రియలో సంకలనాలు కూడా వచ్చాయి. 100 మంది కవులతో "బతుకమ్మ మొగ్గలు", 46 మంది కవులతో "బాలల మొగ్గలు" కవితా సంకలనాలు వెలువడ్డాయి. పదిమంది కవుల యొక్క "ప్రేమ మొగ్గలు" పది సంపుటాలు ఫిబ్రవరి 14 న ఆవిష్కరించనున్నారు. త్వరలో 150 మంది కవులతో "గాంధీజీ మొగ్గలు", అలాగే ఒక 1,116 మంది కవులతో ఉమ్మడి రాష్ట్రంలోని కవులతో "సాయి మొగ్గలు" ఆవిష్కరించనున్నారు.

ప్రక్రియ ఏదైనా ముందుకు వెళ్లాలంటే అందులో కవితా నైపుణ్యం నూతన అభివ్యక్తి, ఆకట్టుకునే శైలి ఉన్నప్పటికీ ప్రచారం లేకపోతే త్వరగా అందరికీ చేరదు. మరి ఈ మొగ్గలను "నేటినిజం" దినపత్రిక తన సిగలో సింగారించుకొని మొగ్గల పరిమళాలను రెండు రాష్ట్రాల్లో వెదజల్లిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. "నేటినిజం" సంపాదకులు బైస దేవదాసు గారు మొదటిసారి మొగ్గలకు తమ పత్రిక ద్వారా విశేషమైన ప్రాచుర్యం కల్పించారు. "బాలల మొగ్గలు" కవితాసంపుటి రావడానికి ప్రధాన కారకులు బైస దేవదాసు గారే.బాలల మొగ్గలను నేటినిజం పత్రికలో నవంబర్ 14 తారీకున బాలల దినోత్సవం సందర్భంగా అగ్రభాగాన వాటిని ముద్రించడం మొగ్గలుకు దక్కిన చక్కని బహుమానంగా చెప్పుకోవచ్చు.

బాల్యం ఒక మధుర జ్ఞాపకం. బాల్యం మరపురాని అనుభూతి. బాల్యం ఎప్పటికీ అపురూపమే. అలాంటి బాల్యంపై 46 మంది కవులు తమ అంతరంగాన్ని ఆవిష్కరించారు. ఇందులోని మొగ్గల్లో బాల్యపు తడిని చాటారు.

పిల్లలు తమ నవ్వులను తెంపుకొచ్చి
ఇంటిల్లిపాదికి దుఃఖాన్ని దూరం చేస్తారు
చీకటిని తుంచి వెలుగును పంచే నేస్తాలు పిల్లలు

ఎంత దుఃఖము ఉన్నా పిల్లలతో సహవాసం చేస్తే ఆ దుఃఖం తెగి సంతోషం సెలయేరై పారుతది.పిల్లలు ఉన్న ఇల్లు ఎప్పుడూ అల్లరి నవ్వులతో ఆనందాన్ని పంచి, విషాదఛాయలు అలుముకుంటే వాటిని తొలగించే వెలుగులౌతారు.

**రాబోయే తరానికి విజ్ఞాన సిరులవుతూ**
**ముద్దు పలుకులతో ముచ్చట గొలుపుతారు**
**బాలలు భవిష్యత్తు తరాలకు తరగని నిధులు**

**సమాజంలో నూతన పరిజ్ఞానాన్ని అందించే భవిష్యత్తు** వారసులు బాలలు. రాబోయే తరానికి నిజంగా వారధులు బాలలే. నేటి బాలలే రేపటి పౌరులు అన్నట్లు దేశ భవిష్యత్తు అంతా బాలల పైనే ఆధారపడి ఉంటుంది. మరి బాలలను నూతన ఆవిష్కరణల వైపు మళ్ళించి సమసమాజ నిర్మాతలు పిల్లలను తీర్చిదిద్దే బాధ్యతను ఈ మొగ్గలో ఉప్పరి తిరుమలేష్ తెలియజేశాడు.

**అక్షరాలు దిద్దాల్సిన బాల్యం**
**వెట్టిచాకిరి నీడలో మసకబారుతుంది**
**బాల్యం వరమే ఎప్పటికీ శాపగ్రస్తం కాదు**

కల్లాకపటంలేని బాల్యం ఆ బాల్యాన్ని ఆస్వాదించలేక పోతున్నారని సముద్రాల శ్రీదేవి ఆవేదన చెంది రాసిన మొగ్గ. బాల్యం అంటే ఎవరికైనా మధురజ్ఞాపకమే. అలాంటి మధురజ్ఞాపకం శాపం కాకూడదంటూ వెట్టిచాకిరిలో బతుకుతున్న బాల్యాన్ని పాఠశాలల వైపు అడుగులు వేయాల్సి ఉందన్నది.

**మల్లెలాంటి తెల్లని మనసు కలిగుండి**
**కల్లాకపటం ఎరుగని స్నేహ కుసుమాలు**
**పిల్లలు అమరికలు లేని ఆశాదీపాలు**





స్వచ్ఛమైన గాలిలా, కల్మషం లేని సెలయేటిలా పారేనవ్వులు బాలలవి. బాల్యంలో ఎలాంటి కపటంలేని మనస్తత్వాన్ని బైరోజు రాజశేఖర్ పరిచయం చేస్తూ అమరికలు లేని ఆశాదీపాలు **బాలలన్నాడు.**

**గురువు చేతి అక్షరపు ముద్దలవుతూ**
**ఆయన బోధనల ప్రభావిత బాణాలు వాళ్ళు**
**బాలలే భావితరాల భవిష్యత్తుకు వెలుగులు**

**గురువుల యొక్క అక్షరాల ముద్దలవుతున్న బాలలు రేపటి భవిష్యత్తు వెలుగు నింపే ఆశా కిరణాలని** కమ్మరి శిరీష భవిష్యత్తుకు భరోసానిస్తూ రాసిన మొగ్గ.

**తెల్ల కాగితమంటి తమ మనసుల్లో**
**గురువులు చెప్పిందే వేదంగా లిఖిస్తారు**
**నమ్మకపు వాకిట్లో రంగవల్లులు బాలలు**

**బాలలు గురువులను అనుసరించే బాటసారులు.** తెల్లపువ్వులా పూసిన మనసులో అక్షరాల దొంతరలను పేర్చేది గురువే. బాల్యంలో గురువు ఏది చెప్పినా అదే వేదంగా రాసుకుంటారు.గురువుపైన అపారమైన నమ్మకం కలిగి ఉంటారని అయిత అనిత పూయించిన మొగ్గ.

పొద్దంతా అలసిపోయి ఇంటికి వచ్చిన వారికి
పిల్లల నవ్వు చూడగానే కష్టమంతా మాయమైతది
కష్టం మోసిన కాయం నవ్వులతో సేదతీరే చెలిమె

పిల్లలు ఉన్న ఇల్లు ఆనందాలకు నిలయమైన ఆలయం. పిల్లలు ఉంటే ఎంతటి కష్టాన్నైనా కరిగించే నవ్వుల ఆయుధం వాళ్ళలో ఉంటుంది. పొద్దంతా పనిచేసి అలసిపోయి ఇంటికి వచ్చినవారికి నూతన ఉత్తేజాన్ని అందించే టానిక్ పిల్లలు నవ్వు అంటుంది అనుపటి హేమలత. పొద్దస్తమానం కష్టాన్ని మోసిన శరీరం నవ్వులతో తడిసె సెలిమె అవుతుంది అంటది.

**కల్మషం ఎరుగని మనసులతో**
**కలకాలం నీతితో బతుకుతారు**
**సహృదయానికి ప్రతిరూపాలు పిల్లలు**

**పిల్లలంటే నీతికి ప్రతిరూపాలు. సహృదయానికి ఆనవాళ్ళు.** అలాంటి పిల్లల మనస్తత్వాన్ని పదవ తరగతి చదువుతున్న సనా అర్షిన్ అపురూపంగా పూయించిన మొగ్గ ఇది.

వెన్నెలలోని చల్లదనాన్ని కురిపిస్తూనే
తేనెలోని తీయదనాన్ని పంచుతారు
బాలలు తీయని నవ్వుల మూటలు

బాలల చెంత మనముంటే వెన్నెలనీడలో తడిసినట్లే. తడబడే మాటలను వింటుంటే అమృతబిందువులను ఆస్వాదిస్తున్నట్లే ఉంటది. బాలలు తీయని నవ్వులమూటలని కె.కృష్ణవేణి అద్భుతంగా ఆవిష్కరించిన మొగ్గ.

ఇట్లా ఈ బాలల మొగ్గలనిండా 46 మంది కవులు రాసిన బాల్యస్మృతులు వారి నుండి మొగ్గలై పూశాయి. పసిమొగ్గల హృదయస్పందన కవుల కలాల నవ్వుల జల్లులై పారినయి. "బాలల మొగ్గలు" కవితాసంపుటిలో బాలకార్మికుల వెట్టిచాకిరి, అనాథ బాలలు ఆర్తనాదాలు, సిరినవ్వుల జలపాతాలు ఒకటేమిటి అనేకానేక కోణాల్లో బాలలను స్పృశించి రాయడం జరిగింది. భవిష్యత్తు అంతా కూడా బాలల చేతనే నిర్మాణం అవుతుందనే భరోసాతో బాలల మొగ్గలను పూయించిన కవులందరికీ శుభాకాంక్షలు.

ప్రతులకు:
డా॥భీంపల్లి శ్రీకాంత్
8-5-38, టీచర్స్ కాలనీ
మహబూబ్‌నగర్-509 001
సెల్: 9032844017



– బోల యాదయ్య
9912206427

## నా అక్షరాలు

నా అక్షరాలు ...
ఉద్యానవనంలో ఊయలూగే
అందమైన ఆడపిల్లల
మెరిసే ముక్కు పుల్లలు !

నా అక్షరాలు ...
పల్లెటూర్లలో
బాల్యంలో గంతులేస్తూ
భేదభావాల్లేక గడిపే
చిన్నారి చిట్టి తల్లులు
కేరింతలతో ఆటలాడుకునే
తొక్కుడు బిల్లలు !

నా అక్షరాలు ...
సత్ సాంప్రదాయాలను
ముందుతరాలకు అందిస్తూ
నిత్య సుమంగళులై శోభిల్లే
సంతోష సౌందర్యరాసుల
ఆరాధ్యమైన బొట్టుబిళ్ళలు !

నా అక్షరాలు ...
గత స్మృతుల అజ్ఞాత
తిమిరాలను తరిమేసి
మనలో స్వాంతన చేకూర్చి
మనసులో వెలుగునింపే
అగ్గిపుల్లలు !

నా అక్షరాలు ...
పాపాయిలకు లాలపోసి
లాలించి జోకొడుతున్నప్పుడు
నిద్రమైకంలో స్వర్గలోక విహారియై
మౌనమునులుగా దరహాసించే
అమాయక చిరునవ్వులు !

నా అక్షరాలు ...
మనసెరిగి మసలుకుని
కవితా మధువాస్వాధించే
సాహిత్య శోధకులందరికి
వసంతంలో ఊహించని
వర్షానికి తన్మయత్వం చెందించే
కవితా చిరుజల్లులు !

నా అక్షరాలు ...
ఎండావానలేకమైన నృత్యహేళికి
నిశబ్ద నీలాకాశంలో వెలసిన
ఇంద్రధనుస్సు అందాలను
అందుకోవాలని విరగబూసిన
పారిజాతం చెట్టుపై పక్షులెగురుతూ
చేసే కిలకిల రావాల చప్పుళ్ళు !!

నా అక్షరాలు ...
గోదారి ఒడ్డున ఇసుక తిన్నెల్లో
తెలిసీ తెలియని వయసులో
ఉల్లాసంతో ఉత్సాహంతో
చిట్టిపొట్టి పాదాలతో
సంబరపడుతూ
కట్టుకునే పిచ్చుకగూళ్ళు !

నాఅక్షరాలు ...
అమ్మమ్మ ఇంటికి సంక్రాంతికి
వెళ్ళినప్పుడు కట్టిచ్చిన
రంగురంగుల పరికిణీలతో
రంగవల్లులపై గొబ్బెమ్మలు
పెట్టేటపుడు మరీ వెంటబడి
వాలే సీతాకోకచిలకలు !

నా అక్షరాలు ...
నను నడిపిస్తూ పలికించే
తల్లి సరస్వతీమాతను
అలంకరించి ఆరాధించే
కలువ పూలమాలలో
నిగూఢంగా దాగిఉన్న
పుప్పొడి రేణువులు !!



– రాజేశ్
9440460490

## మచ్చలేని మనసు

ఆమె
మనసు స్వచ్ఛమైన
తేనె లాంటిది
లేకుంటె ?
నేను ఆమె చుట్టూ
తేనెటీగలా తిరుగుతు ఎందుకు
ప్రదక్షిణలు చేస్తాను!
ఆమె
కుటుంబ బంధాలకు
మల్లె తీగలా చలువ
పందిరి వేస్తుంది
లేకుంటే ?
ఆప్యాయత అనుబంధాలను
పదిలంగా కాపాడుతుంది!

ఆమె
విద్యా స్వరూపిణి
లేకుంటే ?
పిల్లల మంచి క్రమశిక్షణతో
ఎదుగుతూ సమసమాజ
నిర్మాణంలో తమవంతు
పాత్రను పోషిస్తారు!

ఆమె
స్వచ్ఛ భారత్ నిర్మాణ
రథసారథి
లేకుంటే ?
స్వగృహ పరిసరాలను
స్వేతవర్ణంలా మెరిపిస్తుంది!

ఆమె
సమాజ సేవకురాలు
లేకుంటే ?
మహిళలపై జరిగే అఘాయిత్యాలను గూర్చి
గొంతెత్తి ఎలా ఘోషిస్తుంది
ప్రభుత్వాలను నిలదీస్తుంది!
ఆమె సమసమాజ దీపికా
ఆమె నవసమాజ నిర్మాత.



–కోణం పర్శరాములు
–9959524585

## దీపకళికలు

భరతమాత పాపెటలో
కాశ్మీరు కుంకుమ
నెలవంక సింధూర మై
ప్రభలు వెదజల్లు ను
తల్లి గర్భములో ని శిశువునకు
కాశ్మీరు కుంకుమ పువ్వు
మేనిఛాయ ద్విగుణీకృతం చేయ
బిడ్డడు నెల వంక సింధూర మై
ప్రసవాబ్ది తరించి వచ్చి
ధరణిలో అవతరించు ను
సూర్యోదయాన సూర్యుడు
నెలవంక సింధూర మై
తూర్పున ఉదయించును
పడమర కు చేరి
అస్తమించిన వేళ
నెలవంక సింధూర మై
తల్లి గర్భమున జాలువారు ను
భారత దీపకళికలు
కాశ్మీరు కుంకుమ పువ్వులు
నెలవంక సింధూరాలై
జగతికే తలమానిక లగును



–జాధవ్ పుండలిక్ రావు
9441333315

## కల్పవృక్షం

నేను
ఏపుగా పెరిగే కొద్దీ
నేలతల్లి మురుస్తుంది

తనలోని విత్తు
ఆకాశాన్నంటుతుంటే
ఒకింత గర్వంతో నేలతల్లి

తాను రాల్చిన కొన్ని చుక్కలే స్వీకరించి
తననూ తాకుతున్న నన్ను చూస్తూ
మేఘమూ హర్షిస్తుంది

చరిత్రనో
పురాణమో శృంగారమో కాలజ్ఞానమో
నిక్షిప్తం నా ఆకుల్లో
గ్రంధాల చిత్రీకరణల
ఆకు మూలం నేను

అగ్రమో అణగారిణమో
తారతమ్య మెరుగక
గూడు పైకప్పునైన నా ఆకు
గూడు దూలంగా నా మాను

గెల గెల నొడిసేందుకు
నడుం చుట్టూ మోకు
కాళ్ళకి బంధం తో
నన్ను వశపర్చుకునే
శ్రమైక జీవికి తలొంచి
సమస్త జీవులకి ద్రవాన్ని
అందిస్తున్నా నేను

వాగులు వంకలు
దాటాలన్నా పొడవైన నా మాను
అడ్డంగా
ఆచితూచి అడుగులు వేస్తూ
పయనం
గమ్యం చేరే జనం

నా కాయల్లో
ముక్కంటి
జుర్రుకున్నచో అమృతం
మేను చలువ
నా పండు గుజ్జులో
రుచి
ఆస్వాదించిన జిహ్వకే ఎరుక

నేను
నా వనం
మనిషి కనీసవరాలు తీర్చగలిగే
కల్పవృక్ష మాలిక
ఘంటాలతో అక్షరాల వేదిక
తవ్వేకొద్దీ నా మూలాలు చరిత్రలో పదిలం
నన్ను కాపు కాసేది కార్మికుడు
కల్మషమెరుగని వాడూ నేనూ
చిరస్థాయిగా

నేను తాటిచెట్టుని
వాడు గీత కార్మికుడు.



– గిరిప్రసాద్ చెలమల్లు
9493388201

